క్లుప్తంగా

ఉత్సాహంగా బీచ్ క్లీనింగ్



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ఆదివారం ఉదయం వైజాగ్ వలంటీర్లతో కలిసి నిర్వహించిన బీచ్ క్లీనింగ్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పర్యావరణహితంగా నడుచుకోవడం, సముద్రాలను పరిరక్షించుకోవడం లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, ఏయూ విద్యార్థులు భాగమయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు, సభ్యులు పాల్గొని 34 బ్యాగుల వ్యర్థాలను సేకరించి, పారిశుధ్య కార్మికులకు అందజేశారు.

రోడ్డుపై లారీ బోల్తా



మద్దిలపాలెం-ఇసుకతోట ప్రధాన రోడ్డుపై బోల్తా పడిన లారీ

మద్దిలపాలెం: మద్దిలపాలెం నుంచి ఇసుకతోట వైపు వెళ్తున్న ఓ లారీ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున బోల్తా పడింది. ఆ సమయంలో రోడ్డు ఖాళీగా ఉండడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఒడిశాకు భారీ లోడుతో వెళ్తున్న ఈలారీ తెల్లవారుజామున డ్రైవర్ నిద్రలోకి జారడంతో రోడ్డుపై బోల్తా పడిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయలయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే రహదారి ఆదివారం సెలవు, దీనికి తోడు తెల్లవారు జామున కావడంతో వాహనాల రాకపోకలు ఆ సమయంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డు మధ్యలో పడిన ఈ లారీని క్రేన్ సహాయంతో పక్కకు తరలించారు.

ముగిసిన గణితశాస్త్ర సదస్సు



సదస్సునుద్దేశించి ప్రసంగిస్తున్న ఆచార్య జి.వి.ఆర్.బాబు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగంలో నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఉత్తరాంధ్ర సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్, ఆచార్య ఎస్.మీనాక్షి సుందరం స్మారక సొసైటీ, ఏయూ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి. సదస్సుకు విభాగాధిపతి ఆచార్య పి.అనూరాధ కామేశ్వరి అధ్యక్షత వహించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య సి.హెచ్ శ్రీనివాసరావు సదస్సు విజయవంతం కావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఏయూ గణితశాస్త్ర విశ్రాంత ఆచార్యులు జి.వి.ఆర్.బాబు మాట్లాడుతూ పరిశోధన ఆసక్తిని పెంచే విధంగా ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఇంజినీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్.అవధాని, ఆచార్య ఎన్.వి.ఈ.ఎస్.మూర్తి మాట్లాడుతూ గణిత శాస్త్ర ప్రాముఖ్యతను వివరించారు. ఈ సదస్సులో ఆచార్య పి.డి.ఎస్.శ్రీనివాసు, ఆచార్య జి.నానాజీరావు, ఆచార్య ఎస్.రవికుమార్, ఆచార్య ఎన్.రామకృష్ణ, పూర్వ ఆచార్యులు కె.పి.ఎల్.శాస్త్రి, ఆచార్య కె.కె.ఎం.శర్మ, వివిధ కళాశాలల అధ్యాపకులు, వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు చేరువ



11వ వార్డు సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 11వ వార్డులో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం సభ

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 11వ వార్డు పరిధి డ్రైవర్స్ కాలనీలో ఆదివారం మేము సిద్ధం–మా బూత్ సిద్ధం సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ అందుతున్నాయన్నారు. ఆ పథకాలతో ఎక్కువగా మహిళలు లబ్ధి పొందేలా చేసి, వారికి గౌరవాన్ని పెంచారన్నారు. నగరం మరింత అభివృద్ధి జరగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటేయాలని ప్రజలను ఎంవీవీ కోరారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో 600 హామీల ఇచ్చి నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఈసారి కూటమితో వచ్చి ఓటు వేయమంటున్నారని, వారిని నమ్మి మళ్లీ మోసపోవద్దని సూచించారు. తూర్పు నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. బెల్ట్‌షాపులు నడుపుకొని కాలం గడిపారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మేయర్ గొలగాని హరివెంకట కుమారి నియోజకవర్గంతో పాటు ఆరిలోవ ప్రాంతాన్ని ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, నగరాల డైరెక్టర్ కె.మోహనరావు, స్థానిక నాయకులు రమేష్, అప్పలరామ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డులో ఎంపీ ఎంవీవీ విస్తృత ప్రచారం

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర శుక్రవారం 17వ వార్డులో కొనసాగింది. ఇందులో భాగంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ 77వ రోజు 17వ వార్డు సెక్టార్-1లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున తనను తూర్పు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గత కొంత కాలంగా నియోజకవర్గంలోని వార్డుల్లో సమస్యలు పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయంతో రాష్ట్రంలో జగనన్న సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంతో పాటు విశాఖపట్నం అభివృద్ధి వేగంగా జరుగుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



17వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

విద్యా హక్కు చట్టం అమలుతో బాలలకు భరోసా

సీతంపేట: విద్యా హక్కు చట్టం ప్రకారం ఆరు నుంచి 14 ఏళ్ల బాలలకు ప్రభుత్వం ఉచిత విద్య అందించాల్సి ఉందని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రవేశపెట్టి 15 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం ద్వారా బాలలకు భరోసా ఇవ్వాలన్నారు. చట్టం అమలు తీరుపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.

ఓటరు చైతన్య కార్యక్రమం పరిశీలన

మహారాణిపేట: మన పోలింగ్ బూత్–మన ఓటు పేరుతో జిల్లా యంత్రాంగం ఆదివారం ఓటరు చైతన్య కార్యక్రమం నిర్వహించింది. వీఎస్ కృష్ణా ప్రభుత్వ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, పోలింగ్ బూత్‌లను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పరిశీలించారు. అక్కడి పరిస్థితిని గమనించారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఓటర్లకు మెరుగైన రీతిలో సేవలు అందించేందుకు అందరూ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా జేసీ సూచించారు. ఓటర్లకు పోలింగ్ బూత్, ఇతర వివరాలు తెలిపేందుకు పెట్టిన కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చేలా తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీలు, బీఎల్వోలు, తదితరులు పాల్గొన్నారు.



ఓటరు చైతన్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

ముడసర్లోవలో నీటి శుద్ధి చర్యలు



నీటి మడిలోకి పైపు ద్వారా చేరుతున్న నీరు



ముడసర్లోవ పార్కులో గ్యాలరీలో ఏర్పాటు చేసిన మడులు

ఆరిలోవ: ముడసర్లోవలో అధికారులు నీటి శుద్ధి చర్యలు చేపట్టారు. నీటి సరఫరాలో మలినాలు, మట్టి లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ నీటి సరఫరా అధికారులు గ్యాలరీ పని తీరులో మార్పులు చేశారు. గతంలో రిజర్వాయర్ నుంచి నీటిని పైపుల ద్వారా ఈ గ్యాలరీలోకి తరలించేవారు. ఆ గ్యాలరీ అడుగు భాగంలో ఉండే ఇసుక, గులకరాళ్లలో నీరు వడకట్టేవారు. అనంతరం ఆ నీటిని బావిలోకి మళ్లించి క్లోరినేషన్ చేసేవారు. ఈ విధానంలో గ్యాలరీలో ఎక్కువగా నాచుపట్టి నీరు దుర్వాసన వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా చర్యలు చేపట్టారు. గ్యాలరీలో ఐదు మడులు ఏర్పాటు చేశారు. ప్రతి మడిలోకి పెద్ద సైజులో పైపులు అమర్చారు. ముడసర్లోవ రిజర్వాయరు నుంచి వచ్చే నీరు నేరుగా గ్యాలరీలోకి చేరకుండా ముందుగా క్లోరినేషన్ చేసి పైపుల ద్వారా ఇక్కడ మడుల్లోకి మళ్లిస్తున్నారు. ఐదు మడుల్లో రోజూ ఒక మడిని ఆరగడుతున్నారు. అందులో అడుగు భాగంలో నాచు తొలగించేస్తున్నారు. ఇలా ప్రతి రోజూ ఒక మడిని ఆరగట్టడంతో నాచు, నీటి దుర్వాసన సమస్య పోయింది. ఆయా మడుల నుంచి నీటిని గ్యాలరీ బయట ఉండే పెద్ద బావిలోకి మళ్లించి అందులో మరోసారి క్లోరినేషన్ చేసి కుళాయిలు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని ఆరిలోవ కాలనీ అంతటికీ కుళాయిల ద్వారా సరఫరా చేయడంతో పాటు దీన్‌దయాల్‌పురం, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక వరకు కొండవాలు ప్రాంతాలకు, డెయిరీఫారం, ఆదర్శనగర్, రవీంద్రనగర్, తోటగరువు, బాలాజీనగర్, ముస్తఫాకాలనీ, డ్రైవర్స్ కాలనీ, టీఐసీ పాయింట్ తదితర ప్రాంతాలకు జీవీఎంసీ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్టు ముడసర్లోవ నీటి సరఫరా ఏఈ అప్పాజీ తెలిపారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ సూర్యారావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాక్టివ్‌గా ఉన్న రౌడీలను హెచ్చరించారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల పనులపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



ద్వారకా స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ రమేష్

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎక్కడికి వెళ్లిన పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని రౌడీషీటర్లకు సూచించారు. మీరు నివసించే ప్రాంతాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. ఎస్ఐ ధర్మేంద్ర పాల్గొన్నారు.

వేడుకగా ఈస్టర్



ఎంజీఎం పార్కులో ఏర్పాటు చేసిన ఈస్టర్ ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ, బొత్స ఝాన్సీ



ఆరిలోవలో జరిగిన ఈస్టర్ ర్యాలీ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో ఆదివారం ఈస్టర్ పండగ ఘనంగా జరిగింది. క్రైస్తవులు చర్చిలు, పార్కుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. ఆరిలోవ, తోటగరువు, బాలాజీనగర్, ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, ఇసుకతోట, విశాలాక్షినగర్ తదితర ప్రాంతాలలో ఈస్టర్ పండగ సందడి కనిపించింది. ఎండాడ మిరాకిల్ చర్చి ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ పార్కు(వుడా పార్కు) సమీపం ఎంజీఎం పార్కులో ఆరాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో ఈ పండగలో పాల్గొని ఏసుక్రీస్తు ప్రార్థనలు చేశారు. ఆరిలోవలో ఈస్టర్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. మిరాకిల్ చర్చిలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో చర్చి వ్యవస్థాకుడు సామ్యూల్ కర్మోజీ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు.

మద్దిలపాలెం : ఈస్టర్ పండగ సందర్భంగా పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు మరణించి మూడో రోజు సమాధి నుంచి తిరిగి లేవడాన్ని ఈస్టర్ పండగగా క్రైస్తవులు జరుపుకొంటారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రేసపువానిపాలెం, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

10 నుంచి 'కళా పరిచయం' సమ్మర్ కోర్సు

మద్దిలపాలెం: నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళా పరిచయం పేరుతో సమ్మర్ కోర్సు నిర్వహించనున్నామని అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి బత్తిన విక్రమ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు కొనసాగే ఈ కోర్సు సీతమ్మధారలోని క్యాంపస్ లో ఈ నెల 10న ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. క్లాసికల్ డ్యాన్స్, వెస్ట్రన్ డ్యాన్స్, కర్ణాటక శాస్త్రీయ సంగీతం, కీబోర్డు, గిటార్, తబలా, మృదంగం, చిత్ర లేఖనం, చెస్, తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. కోర్సు పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని, 5 నుంచి 50 ఏళ్లలోపు వారు చేరవచ్చునన్నారు. పూర్తి వివరాలకు 98481 37445, 95532 22969 ఫోన్ నంబర్ల లో సంప్రదించా లని సూచించారు.

ఉత్సాహంగా షటిల్ టోర్నమెంట్

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో ఆదివారం షటిల్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరిగింది. ఏయూ షటిలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులతో పాటు బయట ఉద్యోగులకు చెందిన 10 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులు డబుల్స్‌గా పోటీ పడ్డారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలు సాయంత్రం వరకు కొనసాగాయి. పలు జట్ల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. వెంకట్, గోవింద్‌కు చెందిన జట్టు విజేతగా నిలిచాయి. దీంతో పాటు ఈశ్వర్, భర్నిలతో కూడిన జట్టు ద్వితీయ స్థానంలోను ప్రసాద్, వెంకటేష్‌లతో కూడిన జట్టు తృతీయ స్థానంలోను నిలిచి సత్తా చాటాయి. అనంతరం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విజేతలకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కోచ్‌లతో పాటు ఏయూ ఇండోర్ నిర్వాహకుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మెమెంటోలు అందుకున్న టోర్నమెంట్ విజేతలు

పది 'స్పాట్' రెమ్యునరేషన్ పెంపు

- ఒక్కో పేపర్ దిద్దేందుకు రూ.6.60లు నుంచి రూ.10కు పెంపు
- స్పెషల్ అసిస్టెంట్లకు రూ.137 నుంచి రూ.300
- రెమ్యునరేషన్ పెంపుపై సర్వాత్రా హర్షం
- నేటి నుంచి పదో తరగతి మూల్యాంకనం

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, అధికారులకు పెంచిన రెమ్యునరేషన్ చెల్లించేందుకు విద్యాశాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఉపాధ్యాయ వర్గాలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నాయి. 2016లో నిర్ణయించిన రేట్లు ప్రకారమే స్పాట్ వాల్యూయేషన్ విధుల్లో పాల్గొనే వారికి పారితోషికం చెల్లించేవారు. దీనిపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, నాటి టీడీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్పాట్ వాల్యూయేషన్ రెమ్యునరేషన్ పెంపుపై ఉపాధ్యాయ సంఘాల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుంది.

ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానందరెడ్డి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గతేడాది నుంచి రెమ్యునరేషన్ పెంపు అమల్లోకి వచ్చింది. ఉపాధ్యాయులకు సకాలంలో పారితోషికం చెల్లించేందుకు సైతం జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు (ఫైల్)

రెమ్యునరేషన్ పెంపు ఇలా..

ఒక్కో పేపరు దిద్దేందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు గతంలో రూ.6.60లు ఇవ్వగా, దీన్ని రూ.10కు పెంచారు. రోజుకు 40 పేపర్లు వరకు దిద్దేందుకు అవకాశం ఉండటంతో, ఎంతలేదన్నా రూ.264లు పారితోషికం లభించనుంది. క్యాంప్ ఆఫీసర్‌కు రూ.385 నుంచి రూ.578కు పెంచారు. డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.330 నుంచి రూ.495లకు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.286ల నుంచి రూ.429లకు పెంచారు. ఎస్‌ఏలకు రూ.137.50లు నుంచి రూ.300లకు, సీఈలకు రూ.264 నుంచి రూ.396లుకు పెంచారు. ఎగ్జామినర్‌కు రూ.250లు నుంచి రూ.375కు పెంచారు. పరీక్షల ఇన్విజిలేషన్ విధుల్లో పాల్గొన్న వారికి కూడా గతంలో కన్నా రెమ్యునరేషన్ పెంచారు.

స్పాట్‌పై ఉపాధ్యాయుల్లో ఆసక్తి

ఏప్రిల్ 1 నుంచి జిల్లాలో పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం కానుంది. జిల్లాకు కేటాయించిన జవాబు పత్రాల వాల్యూయేషన్‌కు అసిస్టెంట్ ఎగ్జామినర్లు 600 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 320 మంది, చీఫ్ ఎగ్జామినర్లుగా 90 మందికి విధులు కేటాయిస్తూ డీఈవో ఎల్.చంద్రకళ ఉత్తర్వులు జారీ చేశారు.

హర్షణీయం



పరీక్షలు, స్పాట్ వాల్యూయేషన్ విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు, సిబ్బందికి రెమ్యూనరేషన్ పెంచి, వాటిని సకాలంలో చెల్లించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవడం హర్షణీయం. అత్యవసర కారణాలు చూపే వారికి స్పాట్ విధుల్లో కొంతమినహాయింపు ఇవ్వాలి. దీనిపై ఇప్పటికే డీఈవో దృష్టికి తీసుకువెళ్లాం.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి, విశాఖపట్నం

ఉపాధ్యాయులకు ప్రయోజనం



స్పాట్ వాల్యూయేషన్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనం బాగుంది. గతంలో అయితే స్పాట్ విధులు మాకొద్దు అనే పరిస్థితులు ఉండేవి. కానీ అందరికీ ఆమోదకరమైన రీతిలో రెమ్యునరేషన్ ఇస్తుండటంతో ఉపాధ్యాయులు సంతోషంగానే విధుల్లో పాల్గొంటున్నారు.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, విశాఖ జిల్లా

ముడసర్లోవ నిర్వాసితులకు ప్రత్యామ్నాయం



జీవీఎంసీ అధికారులు తొలగించిన పాకలు

ఆరిలోవ: ముడసర్లోవ పార్కు వద్ద కొన్ని దశాబ్దాలుగా ఉండే నివాసితులకు మోక్షం లభించింది. జీవీఎంసీ అధికారులు వారికి వేరే చోట ప్రత్యామ్నాయం కల్పించారు. పార్కు గేటు ఎదురుగా కొన్ని దశాబ్దాలుగా ముడసర్లోవ గ్రామం ఉండేది. ఇక్కడ కొందరు పాకల్లో నివాసం ఉండేవారు. తక్కువ నివాసాలు ఉండడంతో పాటు ఆరిలోవ, చినగదిలి ప్రాంతాలకు దూరం కావడంతో కొందరు కొన్నాళ్ల క్రితమే బయటకు వెళ్లిపోయారు. వారు వెళ్లిపోగా ఇక్కడ సుమారు 15 ఏళ్లు నుంచి 8 పాకల్లో నివాసితులు మిగిలిపోయారు. జీవీఎంసీ అధికారులు ముడసర్లోవ పార్కును ఇటీవల అభివృద్ధి చేయడానికి సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఇక్కడ రోజ్ గార్డెన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అభివృద్ధిలో భాగంగా అధికారులు పార్కు ముందు పార్కింగ్ సదుపాయం కల్పనకు చర్యలు చేపట్టారు. దీంతో గేటు ఎదురుగా ఉండే 8 పాకలు, పురాతనమైన జీవీఎంసీకి చెందిన పెంకుటిళ్లను శని, ఆదివారాల్లో తొలగించారు. ఇప్పటికే నిర్వాసితులకు పైనాపిల్ కాలనీ వద్ద నిర్మించిన హుద్‌హుద్ గృహ సముదాయంలో నివాసాలు కేటాయించారు. ఆయా గృహాలకు నివాసితులు తరలిపోతున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి సౌకర్యాలు లేని చోట నుంచి పక్కా గృహాల్లోకి వెళ్తున్నామని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సేఫ్టీ కోర్సుల సర్టిఫికెట్ల ప్రదానం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లోని సేఫ్టీ కోర్సుల్లో చేరి కోర్సు పూర్తి చేసిన వారికి ఆదివారం సర్టిఫికెట్లను అందించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకరరెడ్డి పాల్గొని ఫైర్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేఫ్టీ కోర్సులు పూర్తి చేసిన వారికి విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, గైస్‌లో నిర్వహిస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కెమికల్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సేఫ్టీ కోర్సుల కరిక్యులమ్ కో ఆర్డినేటర్ ఎ.వరహాలు పాల్గొన్నారు.